సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
సోమవారం । 4 । నవంబర్ । 2024



ప్రతిభాన్వేషణ
ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి గత ప్రభుత్వం ఎంతో కృషి చేసింది. దీంతోపాటు అందులో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకుంది. -8లో



స్టార్టప్ రంగంలో కొత్త అధ్యాయం 'భాస్కర్ ప్లాట్‌ఫాం'
భారతదేశంలో స్టార్టప్‌లకు నూతన వేదికగా రూపుదిద్దుకుంటున్న భాస్కర్ వేదికను స్టార్ట్ అఫ్ ఇండియా వారు ప్రారంభించారు. -8లో

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
33.6/23.6

జిల్లాలో ఆదివారం 23.6 – 33.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు డయల్ యువర్ కలెక్టర్
కడప సెవెన్‌రోడ్స్: ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితి సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా ప్రజలు 08562–244437 ల్యాండ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ సూచించారు.

నేడు ఇంటర్వ్యూలు
కడప ఎడ్యుకేషన్: యోగివేమన విశ్వవిద్యాలయం పీజీ కళాశాలలో కామర్స్, కాంపిట్యూషనల్ డేటా సైన్సెస్ సబ్జెక్టులలో గెస్ట్ ఫ్యాకల్టీ కోసం సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎస్ రఘునాథ్ రెడ్డి తెలిపారు. కామర్స్ సబ్జెక్టు గెస్ట్ ఫ్యాకల్టీకి ఎంకాం అర్హతతో పాటు పీహెచ్‌డీ, నెట్, సెట్ అర్హత ఉండాలని పేర్కొన్నారు. కాంపిట్యూషనల్ డేటా సైన్సెస్ సబ్జెక్టునకు ఎమ్మెస్సీ (మ్యాథ్స్), ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్, ఎమ్మెస్సీ డేటా సైన్స్, ఎంసీఏలలో ఏదో ఒక అర్హతతో పాటు పీహెచ్‌డీ, నెట్, సెట్ అర్హతలు ఉండాలని వివరించారు. అర్హత గల అభ్యర్థులు ఒరిజనల్ అర్హత పత్రాలతో సోమవారం ఉదయం 10 గంటలకు విశ్వవిద్యాలయ క్యాంపస్ లోని ప్రిన్సిపల్ ఛాంబర్‌లో హాజరుకావాలని కోరారు.

జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక


జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

పెద్దముడియం: పెద్దపసుపుల జెడ్.పి.హైస్కూల్‌లో ఆదివారం జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సీనియర్స్ మెన్స్, ఉమెన్స్ జట్ల ఎంపికలు నిర్వహించినట్లు బాల్ బ్యాడ్మింటన్ జిల్లా ఉపాధ్యక్షుడు బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాల నుంచి 50 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. సీనియర్స్ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు నంద్యాలలో 8, 9, 10వ తేదీలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో మండల సెక్రటరీ వంశీకృష్ణ, సీనియర్ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ బ్యాడ్మింటన్ పోటీలు
ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక జార్జ్‌కారొనేషన్ క్లబ్‌లో సోమవారం 68వ ఎస్జీఎఫ్ఐ బాలబాలికల అండర్ –19 పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ జిలాని బాషా ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 130 మంది క్రీడాకారులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. టీం చాంపియన్‌షిప్, వ్యక్తిగత చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహిస్తామని ఈ పోటీల్లో ప్రతిభ కనబరచిన వారిని రాష్ట జట్టుకు ఎంపిక చేస్తామని వివరించారు. పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు మధ్యప్రదేశ్‌లో ఈ నెల 17 నుంచి జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు.

6 నుంచి రాష్ట్ర స్థాయి పోటీలు
మదనపల్లె సిటీ: బాల్‌బాడ్మింటన్ అండర్–14 బాల,బాలికల రాష్ట్ర స్థాయి పోటీలు ఈనెల 6,7 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వసంత తెలిపారు. ములకలచెరువులో జరిగే పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. అన్ని జిల్లాల నుంచి క్రీడాకారులు పోటీలకు హాజరు కానున్నట్లు తెలిపారు.

అంతర్ కళాశాలల పోటీలు ప్రారంభం


షూటింగ్ పోటీలను ప్రారంభిస్తున్న వీసీ కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్: యోగివేమన విశ్వ విద్యాలయంలో ఆదివారం 2వ దశ అంతర్ కళాశాలల పోటీలను వైవీయూ వీసీ కృష్ణారెడ్డి ఆదివారం ప్రారంభించారు. వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, షూటింగ్ , బెస్ట్ ఫిజిక్ పోటీలను నిర్వహించారు. సంబంధిత పోటీలను విశ్వవిద్యాలయం వ్యాయామ విద్య, క్రీడాశాస్త్రల విభాగంలో ఈ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లాలోని 10 కళాశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కుల సచివులు పి. పద్మ, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ రామసుబ్బారెడ్డి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



ఆరోగ్యశ్రీకి పాతర!

దేశ చరిత్రలోనే బృహత్తర పథకం ఆరోగ్యశ్రీ. ఇది పేదలకు పునర్జన్మనిచ్చే పథకం. అలాంటి పథకానికి కూటమి ప్రభుత్వం పాతరవేసే దిశగా పావులు కదుపుతోంది. అందులో భాగంగా ఈ పథకాన్ని బీమా (ఇన్‌స్రూ) పరిధిలోకి తేవడానికి చాపకింద నీరులా చర్యలు చేపడుతోంది. దీంతో ఆరోగ్యమిత్రల్లో ఉద్యోగ అభద్రత... ఆందోళన మొదలైంది. మరోవైపు నిరుపేద వర్గాల్లో కలవరం ప్రారంభమైంది.

- ఆరోగ్యశ్రీని రద్దు చేసే దిశగా చర్యలు
- నూతన ఆరోగ్య పాలసీ కింద 'ఇన్‌స్రూ పరిధిలోకి తేవడానికి అడుగులు
- ఆరోగ్యమిత్రల్లో నెలకొన్న ఉద్యోగ అభద్రత
- సీఈఓతో ఆరోగ్యమిత్రల చర్చలు
- సమస్యలు పరిష్కారం కాకపోతే సమ్మెలోకి వెళతామని చెప్పిన సిబ్బంది
- వైఎస్సార్ సీపీ పాలనలో ఉద్యోగుల పదోన్నతులు, వేతనాల పెంపునకు చర్యలు
- ఫైల్ నంబరు 1334631ను అటకెక్కించిన టీడీపీ కూటమి ప్రభుత్వం
- బృహత్తర పథకానికి 'చంద్ర' గ్రహణం

కడప రూరల్: పాలకులు ప్రజల అవసరాలను గమనించి ఆ దిశగా అడుగులు వేయాలి. అయితే టీడీపీ కూటమి ప్రభుత్వం మాత్రం వ్యతిరేక దిశగా పయనిస్తోంది. భారతదేశ చరిత్రలోనే ఆరోగ్యశ్రీ పథకం ఎంతో బృహత్తరమైనది. ఈ పథకానికి ప్రస్తుత పాలకులు సమాధి కట్టే దిశగా చర్యలు తీసుకోవడం సర్వత్రా చర్చనీయాశంగా మారింది.


విజయవాడలో ఆరోగ్య శ్రీ సీఈఓ డాక్టర్ లక్ష్మీ షాతో చర్చలు జరుపుతున్న ఆరోగ్య శ్రీ సిబ్బంది

ఆరోగ్యశ్రీ రాక ముందు..

ఆరోగ్య శ్రీ పథకం రాక ముందు నిరుపేదలకు ఏదైనా పెద్ద జబ్బు వస్తే జిల్లాకు చెందిన వారు కడప నగరంలోని పెద్దాస్పత్రికి వచ్చేవారు. ఇక్కడ ఆ రోగం నయం కాకపోతే తిరుపతి, కర్నూలు లేదా హైదరాబాదులోని ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లేవారు. పేదల చావైనా, బతుకైనా ప్రభుత్వ ఆస్పత్రుల వైద్యంపైనే ఆధారపడి ఉండేది. ఎందుకంటే వారికి ఏమాత్రం ఆర్థిక స్థోమత లేనందున కనీసం కార్పొరేట్ ఆస్పత్రుల గడపనైనా తొక్కలేక పోయేవారు. అదే కాస్త స్థోమత కలిగిన వారు హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో ఉన్న కార్పొరేట్ ఆస్పత్రులకు లేదా రాయవేలూరు సీఎంసీ, బెంగళూరులోని ప్రఖ్యాత సెయింట్ జాన్ తదితర ఆస్పత్రులకు వెళ్లి చికిత్స పొందేవారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక దేశ చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా 2007–2008లో పేదలకు ఉచిత వైద్యానికి ఆరోగ్యశ్రీని తెచ్చారు. తద్వారా నిరుపేదలు ప్రఖ్యాతి చెందిన కార్పొరేట్ ఆస్పత్రుల్లో దర్జాగా ఉచిత వైద్య సేవల ద్వారా పునర్జన్మను పొందారు. అనంతరం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీని మరింత బలోపేతం చేశారు. దీంతో నిరుపేదలకు ఏ అనారోగ్య సమస్య వచ్చినా చీకు..చింతా లేకుండా ఒక్క పైసా ఖర్చు పెట్టకుండా ఉచితంగా వైద్య సేవలు పొందడం ద్వారా నిశ్చింతంగా జీవనం సాగిస్తున్నారు. అలాంటి పథకానికి టీడీపీ ప్రభుత్వం రాకతో బీటలు పడటం ప్రారంభమైంది.

ఇన్‌స్రూ పరిధిలోకి తేవడానికి కుట్రలు

టీడీపీ కూటమి ప్రభుత్వం రావడంతో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవగా మార్పు చేశారు. పేరు మార్పుతోపాటే పథకంలో కూడా అనూహ్యమైన మార్పు తీసుకు రావడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. అందులో భాగంగా కొన్ని రాష్ట్రాలలో అమలులోఉన్న ఆయుష్మాన్ భారత్ పథకాన్ని రాష్ట్రంలో కూడా తీసుకొచ్చి ఆ పథకానికి బీమాను అనుసంధానం చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టడం మొదలు పెట్టింది. దీంతో ఏళ్ల తరబడి ఆరోగ్యశ్రీని నమ్ముకుని పని చేస్తున్న ఆరోగ్యమిత్రల్లో ఆందోళన మొదలైంది. ఆరోగ్యశ్రీ 'ఇన్‌స్రూ పరిధిలోకి వెళితే ఆ సంస్థకు చెందిన వారు తమను తీసేసి మరొకరిని నియమించుకుంటారనే వాదన బలంగా వినబడుతోంది. కాగా వాస్తవానికి జరిగేది కూడా అదే కావడంతో ఆ సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల్లో అభద్రత నెలకొంది. దీనికితోడు ఈ వైద్య సేవలు బీమా పరిధిలోకి వెళితే వ్యాధుల సంఖ్య, ప్యాకేజీ గణనీయంగా తగ్గుతుంది. దీంతో 'ఆరోగ్యశ్రీ'లో ఉండే ప్రయోజనాలు 'బీమా'తో ఎంత మాత్రం 'ధీమా' ఇవ్వదనే సంగతి స్పష్టంగా అర్థమవుతోంది.

సీఈఓతో చర్చలు తెగలేదు...ముడిపడలేదు...

ఈ నేపథ్యంలోనే ఆరోగ్య మిత్రలు ఇటీవల ఆరోగ్య శ్రీ ట్రస్ట్ సీఈఓ డాక్టర్ డీ.లక్ష్మీ షాతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఆరోగ్య మిత్రలు, టీం లీడర్లు తమ ఉద్యోగ భద్రతపై చర్చించారు. తమ న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని కోరారు. లేదంటే ఉద్యోగ భద్రతపై ఎందాకైనా వెళతామని తెగేసి చెప్పారు. అందుకు సీఈఓ స్పందిస్తూ మీ డిమాండ్స్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతా, సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. అందులో భాగంగా జిల్లాల వారీగా జిల్లా కలెక్టర్‌ల ద్వారా ఒక నివేదికను ప్రభుత్వానికి పంపేలా చర్యలు తీసుకుంటాం. అంతవరకు ఎలాంటి ఆందోళనలు చేపట్టవద్దని చెప్పినట్లుగా సమాచారం. అయితే సమస్య పరిష్కారం కాకపోతే సమ్మె తప్పదని ఆరోగ్య మిత్రలు తమ అభిప్రాయంను తేల్చి చెప్పారు.

జిల్లాలో ఆరోగ్యశ్రీ వివరాలు

ఆరోగ్య మిత్రలు, ఇతర సిబ్బంది : 102
నెట్‌వర్క్ ఆసుపత్రులు : 108
ఆరోగ్య శ్రీ కార్డులు: 5.10 లక్షలు



ఆరోగ్య శ్రీ వ్యాధుల సంఖ్య పెంపు వివరాలు

సంవత్సరం	వ్యాధుల సంఖ్య
2007 (మొటి విడత)	542
2008 (రెండవ విడత)	1,040
2021	2,434
2022	3,255

వైఎస్ఆర్‌సీపీ పాలనలో సిబ్బంది ఉద్యోగ భద్రతకు చర్యలు



వైఎస్సార్‌సీపీ పాలనలో ఆరోగ్య శ్రీలో పనిచేసే సిబ్బంది ఉద్యోగ భద్రతకు..వేతనాల పెంపునకు చర్యలు చేపట్టారు. టీం లీడర్లకు సీనియర్ అసిస్టెంట్‌గా, ఆరోగ్య మిత్రలను జూనియర్ అసిస్టెంట్ లేదా డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పరిగణించడంతో పాటు అందుకు తగిన వేతనాలను మంజూరు చేయాలని సంకల్పించింది. తద్వారా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో ఆరోగ్య శ్రీలో పనిచేసే సిబ్బందికి కూడా ఉద్యోగ భద్రత కల్పించడానికి చర్యలు చేపట్టింది. ఆ మేరకు ఫైల్ నంబరు 1334631 సిద్ధమైంది. ఇందుకు నాటి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆమోదం తెలిపారు. దీంతో ఆరోగ్య మిత్రల్లో సంతోషం నెలకొంది. అంతలోనే ఎన్నికల కోడ్ రావడంతో ఆ ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది. తరువాత వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం ఆ ఫైల్‌ను పూర్తిగా పక్కన పెట్టేసిందని సిబ్బంది వాపోతున్నారు. అసలు ఆరోగ్య శ్రీ అంటేనే వైఎస్ కుటుంబంది. దాన్నెందుకు తాము బలోపేతం చేయాలనే ఆలోచన టీడీపీ పాలకుల్లో ఉంది. ఏ పథకమైనా ప్రజలకు చెందినది. దాని వలన ప్రజలకు ఉపయోగమా, లేదా అనే అంశాన్ని ఎందుకు చూడడం లేదనే వాదన వినిపిస్తోంది.

ఆర్టీసీ బస్సు- సిలిండర్ల లారీ ఢీ


చెల్లాచెదురుగా పడిన గ్యాస్ సిలిండర్లు



తోటలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు


గాయపడిన బస్సు డ్రైవర్

- బస్సు డ్రైవర్ సహా 15 మందికి గాయాలు
- కర్ణాటకలో చింతామణి వద్ద ఘటన

చింతామణి: కడప నుంచి బెంగళూరుకు వెళ్తున్న ఏపీఎస్ ఆర్టీసీ బస్సు– వంట గ్యాస్ సిలిండర్ల లోడుతో వెళ్తున్న లారీ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో 15 మంది గాయపడ్డారు. కర్ణాటకలో చిక్కబళ్లాపుర జిల్లా చింతామణి రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని సంతకల్లహళ్లి క్రాస్ దగ్గర ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. ఆదివారం మధ్యాహ్నం కడప నుంచి మదనపల్లి మీదుగా బెంగళూరుకు వెళుతున్న ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు, సంతకల్లహళ్లి క్రాస్ దగ్గర ఎదురుగా వస్తున్న సిలిండర్ల లారీ అదుపుతప్పి ఢీకొన్నాయి. బస్సు రోడ్డు పక్కన ఉన్న తోటలోకి దూసుకెళ్లింది. లారీ ఓ వైపు బాగా ధ్వంసం కాగా, సిలిండర్లు ఎగిరి రోడ్డుపై చిందరవందరగా పడిపోయాయి. అదృష్టవశాత్తు అవి పేలకపోవడంతో మరో ప్రమాదం తప్పినట్లయిందని ఆ ప్రాంతవాసులు ఊపిరిపీల్చుకొన్నారు. ప్రమాదంలో బస్సు డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. వెంకటేష్, నిత్య పూజ, అరుణమ్మ సహా బస్సులో 15 మంది ప్రయాణికులు గాయపడ్డారు. బాధితులు కడప, అన్నమయ్య జిల్లాలకు చెందినవారు. క్షతగాత్రులు చింతామణి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఘటనాస్థలాన్ని మంత్రి సుధాకర్, డీఎస్పీ మురళీధర్, సీఐ శివరాజ్ పోలీసులు పరిశీలించారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి


మాట్లాడుతున్న విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ చైర్మన్ సుదర్శన్ రెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలోని విద్యుత్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ చైర్మన్ సుదర్శన్ రెడ్డి , ప్రధాన కార్యదర్శి సుబ్బిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విద్యుత్ ట్రేడ్ యూనియన్ల జిల్లా సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సర్వీసులు, లెన్త్ ఆఫ్ లైన్స్ , డీటీఆర్ లు 4 రెట్లు పైగా పెరిగాయని.. అందకనుగుణంగా 20 ఏళ్లగా కార్మిక, ఉద్యోగుల పోస్టులు మాత్రం పెంచడం లేదన్నారు. విద్యుత్ ఉద్యోగులకు రెండు డీఏ లు పెండింగ్ లో ఉన్నాయన్నారు. విద్యుత్ సంస్థల్లో ఖాళీ పోస్టులను ప్రస్తుతం పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులతో భర్తీ చేయాలని కోరారు. విద్యుత్ యాజమాన్యాలు కాంట్రాక్టు కార్మికుల విషయంలో సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నాయని మండిపడ్డారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, స్ట్రగుల్ కమిటీ నాయకులు యస్ .జి .శేఖర్ , సురేంద్ర, నాగమల్లయ్య,బాషా,శివప్రసాద్‌రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక అంశంలో ప్రభుత్వం విఫలం

రాయచోటి అర్బన్: ఉచితంగా ఇసుకను అందచేస్తామన్న హామీ అమలులో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీరాములు అన్నారు. ఆదివారం ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇసుక ఉచితం అంటూ చెబుతున్న కూటమి ప్రభుత్వం ఆచరణలో చూపడం లేదన్నారు. మొత్తం రాష్ట్రంలో 110 ఇసుక ర్యాంపులు ఉంటే 76 ర్యాంపులు మాత్రమే ప్రారంభించి మిగిలినవి చేయలేదన్నారు. ఇసుక ర్యాంపులను ప్రైవేటు ఏజన్సీలకు కేటాయించడం అంటే అక్రమ వ్యాపారానికి అవకాశం ఇవ్వటమేనన్నారు. భవన నిర్మాణ కార్మికులను అన్నిరకాలుగా ఆదుకోవాలన్న డిమాండ్‌తో ఈనెల 11న అన్ని కలెక్టరేట్‌ల వద్ద జరిగే ధర్నా కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

కలెక్టర్‌గా డాక్టర్ చెరుకూరి శ్రీధర్



కడప సెవెన్‌రోడ్స్: వైఎస్సార్ జిల్లా కలెక్టర్‌గా డాక్టర్ చెరుకూరి శ్రీధర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వు జారీ చేసింది. 2009 బ్యాచ్‌కు చెందిన శ్రీధర్ గతంలో చిత్తూరు జాయింట్ కలెక్టర్‌గా పనిచేశారు. ప్రస్తుతం పరిశ్రమలశాఖ డైరెక్టర్‌గా ఉన్నారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేస్తున్న శివశంకర్ లోతేటి తెలంగాణ క్యాడర్‌కు చెందిన వారు కావడంతో అక్కడికి వెళ్లిపోయారు. దీంతో కొద్దిరోజులుగా కలెక్టర్ పోస్టు ఖాళీగా ఉంది. ఎట్టకేలకు ప్రభుత్వం కొత్త కలెక్టర్‌ను నియమించింది.

దేదీప్యమానం!





కార్తీక దీప వెలుగుల్లో శివాలయాలు శోభిల్లనున్నాయి. శివనామస్మరణతో మార్మోగనున్నాయి. కార్తీకమాసం ప్రారంభం కావడంతో జిల్లాలోని శైవక్షేత్రాలు అందంగా ముస్తాబయ్యాయి. నేడు తొలి కార్తీక సోమవారం సందర్భంగా కార్తీక దీపాలు వెలిగించేందుకు ఆలయ ఆవరణలు సిద్ధమయ్యాయి. దాదాపు ప్రతి శివాలయంలోనూ వీలున్నంత మేరకు భక్తులు దీపాలు వెలిగించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పలుచోట్ల ఉన్న స్థలాలను మరింత విశాలం చేసి రద్దీ నియంత్రణకు బారికేడ్లు, నీడనిచ్చేందుకు చలువ పందిళ్లు, షామియానాలు ఏర్పాటు చేశారు. ఉభయదాతలు ప్రసాదాల ఏర్పాటుకు సిద్ధమయ్యారు. ఉదయం 4 గంటల నుంచి అన్ని శివాలయాల్లోనూ స్వామికి విశేష అభిషేకాలు చేస్తారు. 5.30 గంటల నుంచి భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తారు.

– కడప కల్చరల్

కార్తీకం.. శుభకరం -8లో

క్లుప్తంగా

పారిపోయిన ఖైదీ అరెస్ట్

కడప అర్బన్ : ఓపెన్ ఎయిర్ జైలు నుంచి గత నెల 30న పారిపోయిన ఖైదీ చిత్తూరు జిల్లాలోని నగరి ప్రాంతానికి చెందిన శరవన్ అని కడప కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ రాజేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సంఘటన జరిగిన వెంటనే రిమ్స్ పీఎస్‌లో కేసు నమోదు చేశారని, అతనిని తిరిగి అరెస్ట్ చేసి కేంద్ర కారాగారానికి తరలించినట్లు తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యాపారి మృతి



మృతి చెందిన మహబూబ్ షరీఫ్

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక బైపాస్ రోడ్డులోని మడూరు క్రాస్ వద్ద షేక్ పూల మహబూబ్ షరీఫ్ (51) అనే వ్యాపారి ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చాపాడు మండలం మడూరు గ్రామానికి చెందిన మహబూబ్ షరీఫ్ టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్రవాహనంలో ఊరూరా తిరుగుతూ చిరుతిండ్లను విక్రయిస్తుంటాడు. అతను ఆదివారం రాత్రి ప్రొద్దుటూరు నుంచి ఇంటికి వెళుతున్న సమయంలో క్రాస్ వద్ద రాగానే.. జమ్మలమడుగు వైపు నుంచి వస్తున్న బొలెరో వాహనం ఢీకొంది. తీవ్రగాయాలైన అతను కొద్ది సేపటి తర్వాత మృతి చెందాడు. అతనికి భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. రూరల్ ఎస్ఐ మహమ్మద్ రఫీ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి కుమారుడు బరూన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ తెలిపారు.

గ్యాస్ సిలిండర్ల లారీ బోల్తా

వేంపల్లె : వేంపల్లె సమీపంలోని ఎస్ఎస్ఆర్ కల్యాణ మండపం వద్ద గ్యాస్ సిలిండర్ల లారీ బోల్తా పడింది. అయితే ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున అనంతపురం నుంచి లక్కిరెడ్డిపల్లెకి హెచ్‌పీ గ్యాస్ లారీ బయలు దేరింది. వేంపల్లెలోని పులివెందుల రోడ్డులో ఉన్న ఎస్ఎస్ఆర్ కల్యాణ మండపం వద్ద రాగానే ఒక్కసారిగా డివైడర్‌కు ఢీకొని బోల్తా పడింది. డ్రైవర్‌కు చిన్న గాయాలు తప్ప ఎలాంటి ప్రమాదం జరగలేదు. గ్యాస్ లారీ బోల్తా పడడంతో విషయం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గ్యాస్ లీకై ఉంటే చాలా ప్రమాదం జరిగి ఉండేదని ఆ ప్రాంత ప్రజలు భయాందోళనకు గురయ్యారు. డ్రైవర్ నిద్రమత్తు కారణంగానే ప్రమాదం జరిగిందని వారు చర్చించుకోవడం జరిగింది.

కడపలోని దుకాణాల్లో దొంగల హల్‌చల్

కడప అర్బన్ : కడప తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో చిల్లర దొంగలు హల్‌చల్ చేశారు. ఆదివారం తెల్లవారుజామున ఇద్దరు దొంగలు.. తాళాలను వేసిన కొన్ని షాపులలోకి చొరబడ్డారు. కేకే బేకరి, కొరియర్ ఆఫీసు, పల్లెపాల కేంద్రంలోనూ చోరీలు జరిగాయి. క్యూ అండ్ క్యూలో చోరీ యత్నం విఫలమైంది. కొన్ని షాపులలో షట్టర్‌ను తెరిచేందుకు విఫలయత్నం చేశారు. ఆయా షాపుల్లోకి ప్రవేశించిన దొంగలు టీషర్ట్‌లు వేసుకోవడం, దేవుని హుండీల వద్ద డబ్బులను తీసుకోవడం లాంటివి చేశారు. ఇప్పటి వరకు బాధితులు ఎవరూ లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు చేయలేదని, సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నామని పోలీసులు తెలిపారు. కాగా పోలీసులు ఓ దొంగను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం.

కార్తీకం.. శుభకరం

- ప్రారంభమైన కార్తీక మాసం
- సోమవారాల్లో విశేష పూజలు
- పౌర్ణమినాడు కల్యాణాలు

కడప కల్చరల్ : కార్తీకమాసం ప్రారంభమైంది. ఈ సందర్భంగా గురువారం శైవ, వైష్ణవ దేవాలయాన్నీ కొత్త కళను సంతరించుకున్నాయి. సాధారణంగా అందరూ ఈ పండుగను శైవులకు సంబంధించినదని భావిస్తారు. కానీ ఈ పండుగ శివకేశవులిద్దరికీ ముఖ్యమైనదేనని పెద్దలు చెబుతున్నారు. అటు శివాలయాల్లోనూ, ఇటు వైష్ణవ ఆలయాల్లోనూ ఈ మాసమంతా విశేష పూజలు నిర్వహిస్తారు. ముఖ్యంగా ఇతర మాసాలతో పోలిస్తే శైవులకు కార్తీకమాసం అత్యంత పవిత్రమైంది. ఈ సందర్భంగా ఉదయాన్నే శివుడికి విశేష అభిషేకాలు చేసి పూజలు నిర్వహిస్తే పుణ్యం లభిస్తుందని విశ్వాసం. ప్రతి సోమవారం తెల్లవారుజాము నుంచి శివాలయాల్లో కార్తీక దీపాలు వెలిగిస్తారు. ప్రతిరోజు అర్చకులు ధ్వజస్తంభంపై ఆకాశదీపం వెలిగిస్తారు. పౌర్ణమినాడు జ్వాలాతోరణాలు వెలిగించడం పుణ్యదాయకమని విశ్వసిస్తారు. దీపాలను చెరువులు, కాల్వల్లో వదులుతారు. ఈ మాసమంతా సోమవారాలతోపాటు ఇతర రోజుల్లో కూడా శివాలయాలు భక్తులతో సందడిగా మారుతాయి. ఈ సందర్భంగా ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాలో కార్తీక పూజలు నిర్వహించే ప్రముఖ శివాలయాల గురించి క్లుప్తంగా..


నాగనాథేశ్వరుడు

ఖాజీపేట మండలంలో ప్రకృతి రమణీయత మధ్య శ్రీ నాగనాథేశ్వరుని కోన ఆహ్లాదాన్ని పంచుతుంది. పుల్లూరు సమీపంలోని నాగేశ్వరుని కొండపై స్వామి స్వయంభువుగా వెలిశారు. చారిత్రాత్మకమైన ఈ ఆలయంలో కార్తీక మాసమంతా జనం కిటకిటలాడుతారు. ఇక్కడి గుహల్లో బౌద్ధ చిహ్నాలుగల శిథిలాలు బయల్పడ్డాయి. భక్తులు కొండపైగల స్వామిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున తరలివస్తారు.

భైరేశుని కోన

వేముల సమీపంలోని నల్లచెరువుపల్లెకు నాలుగు కిలోమీటర్ల దూరంలోగల మోపూరు కొండపై శ్రీ భైరేశ్వరుని ఆలయం ఉంది. స్వయంభువుగా భావించే ఇక్కడి శివలింగం 18 అడుగుల ఎత్తు, ఆరు అడుగుల చుట్టు కొలతతో భారీగా కనిపిస్తుంది. కార్తీక మాసమంతా ఈ క్షేత్రంలో భక్తుల సందడి కనిపిస్తుంది. వీటితోపాటు జిల్లాలో ఇంకా బద్వేలు సమీపంలోని లంకమల అరణ్యంలో శ్రీ రామలింగేశ్వరస్వామి క్షేత్రం, అనిమెల సంగమేశ్వరస్వామి క్షేత్రం, అల్లాడుపల్లె వీరభద్రస్వామి క్షేత్రం, బ్రహ్మంగారిమఠం తదితర ప్రాంతాల్లో కూడా శివభక్తులు ఈ మాసమంతా విశేష పూజలు చేసి దీపాలు వెలిగిస్తారు.

• పుష్పగిరి



పుష్పగిరి శివకేశవుల ఆలయాల ప్రాంగణం

జిల్లాలోని ప్రముఖ పర్యాటక క్షేత్రాలలో పుష్పగిరి ప్రథమ శ్రేణిలో ఉంది. శివకేశవులకు అబేధంగా నిలుస్తున్న ఈ క్షేత్రంలో కార్తీకమాసం అంతా భారీగా పూజలు జరుగుతాయి. ఇటీవల గిరి ప్రదక్షిణ నిర్వహిస్తుండటంతో పుష్పగిరికి విస్తతమైన ప్రచారం లభించడంతో భక్తులు కూడా పెద్ద సంఖ్యలో వస్తారని అంచనా వేస్తున్నారు. పెన్నానది ఒడ్డున గల ఈ క్షేత్రంలో కార్తీక మాసమంతా భక్తుల సందడి కనిపిస్తుంది. కడప నగరంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు తెల్లవారుజామునే.. అక్కడికి చేరి పెన్నానదిలో స్నానం చేసి పూజలు నిర్వహిస్తారు.

• త్రేతేశ్వరస్వామి ఆలయం



అత్తిరాల త్రేతేశ్వరస్వామి ఆలయం

రాజంపేట నుంచి నెల్లూరు మార్గంలో ఉన్న అత్తిరాల క్షేత్రంలో త్రేతేశ్వరస్వామి ఆలయం ఉంది. గుట్టపై గల ఈ ఆలయంలో శ్రీ త్రేతేశ్వర స్వామి పూజలందుకుంటున్నారు. ఈ ప్రాంతంలో కామాక్షిమాత ఆలయంతోపాటు గదాధర స్వామి ఆలయం కూడా ఉంది. కార్తీక మాసమంతా ఈ క్షేత్రం భక్తులతో, వారు పెట్టే కార్తీక దీపాలతో కళకళలాడుతుంది. ఇక్కడి మడుగులో భక్తులు తెల్లవారుజామున స్నానాలు చేసి స్వామిని దర్శించుకుంటారు.

• గుండ్లూరు శివాలయం



గుండ్లూరు శివాలయం

నందలూరు వద్దగల గుండ్లూరు శివాలయానికి ఓ విశిష్టత ఉంది. కార్తీక మాసంలో ఏదో ఒక సోమవారం ఆలయంలో అడుగు మేరకు నీరు ఊరుతుంది. తిరిగి సాయంత్రానికి నీరు ఆరిపోతుంది. ఆలయం వెలుపల భారీ వృక్షాలు, ఆలయం లోపల ఈ క్షేత్రం అత్యంత పురాతనమైనదని తెలుపుతున్న దేవతా మూర్తుల శిథిల శిల్పాలు ఉన్నాయి. విశాలమైన ఈ ఆలయ ప్రాంగణంలో కార్తీక మాసంలో సమీప ప్రాంతాలకు చెందిన భక్తులు పూజలు నిర్వహిస్తారు.

• శ్రీ వీరభద్రాలయం



శ్రీ వీరభద్రస్వామి

దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి చెందిన, అత్యంత పురాతనమైనదిగా భావిస్తున్న రాయచోటి శ్రీ వీరభద్రస్వామి ఆలయం జిల్లాలో ప్రముఖ దేవాలయాలలో ఒకటి. 10, 11 శతాబ్దాలలో నిర్మితమైనదిగా భావిస్తున్న ఈ ఆలయంలో వీరభద్రస్వామి ఆలయం పక్కనే శ్రీ భద్రకాళిమాత ఆలయం కూడా ఉంది. కర్ణాటక, మహారాష్ట్ర నుంచి ఈ క్షేత్రానికి కార్తీకమాసమంతా శైవ భక్తులు పెద్ద ఎత్తున రావడం పరిపాటి.

• పొలతల మల్లేశ్వరుడు



పొలతల శ్రీ మల్లికార్జునుడు

జిల్లాలో అత్యంత ప్రాముఖ్యత, ఉత్సవ సమయంలో పెద్ద ఎత్తున భక్తులు వచ్చే ఆలయాలలో పొలతల మల్లేశ్వరస్వామి ఆలయం ఒకటి. పెండ్లిమర్రి మండలంలోని ఎత్తయిన కొండలపై విశాలమైన ఆవరణలో గల చిన్న గుట్టపై శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి కొలువై ఉన్నారు. సమీపంలో అక్కదేవతలు కూడా ఉన్నారు. చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన ప్రజలు కార్తీక మాసంలో ఈ క్షేత్రంలో విశేష పూజలు నిర్వహిస్తారు.

ఇసుకను అక్రమంగా తరలించే యత్నం

రెండు టిప్పర్లు, హిటాచి, జేసీబీలను స్వాధీనం చేసుకున్న పోలీసులు



వేంపల్లె : కొందరు అక్రమార్కులు పాపాఘ్ని నది నుంచి ఇసుకను అక్రమంగా తరలించేందుకు యతి్నంచారు. శనివారం రాత్రి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ఆర్‌కే వ్యాలీ పోలీసులు పాపాఘ్ని నదిలో ఇసుకాసురులపై దాడులు నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆర్కే వ్యాలీ ఎస్సై భాస్కర్‌రెడ్డి.. కొందరు టిప్పర్లతో అక్రమంగా ఇసుకను తరలించేందుకు ప్రయత్నిస్తుండగా దాడులు చేశారు. రెండు టిప్పర్లు, హిటాచి, జేసీబీలను అదుపులోకి తీసుకున్నారు. పాపాఘ్ని నదిలోకి ముందుగా టిప్పర్ల ద్వారా గ్రావెల్ మట్టిని తీసుకుని వచ్చి రోడ్డు నిర్మాణం చేసుకుంటున్నారు. ఆ తర్వాత టిప్పర్లలో హిటాచి ద్వారా ఇసుకను తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఆలోపే పోలీసులు రంగ ప్రవేశం చేసి అక్రమార్కుల పనిపట్టారు. అక్రమంగా ఇసుకను తరలించకుండా వాహనాలను స్వాధీనం చేసుకుని వేంపల్లె పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఇందుకు సంబంధించి 8 మందిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. ఈ విషయంపై వేంపల్లె సీఐ సురేష్‌రెడ్డితో విలేకరులు మాట్లాడగా స్వాధీనం చేసుకున్న వాహనాలను సోమవారం తహసీల్దార్‌కు అప్పగిస్తామని తెలిపారు. తహసీల్దార్ వీరిపైన చర్యలు తీసుకుంటారా లేక ఫైన్ వేసి వదిలేస్తారా అనేది తెలియాల్సి ఉంది.

జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య



బాబుల్‌రెడ్డి మృతదేహం

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని బ్రాహ్మణపల్లి రోడ్డు శేషారెడ్డి స్కూల్ సమీపంలో రేకుల షెడ్డులో నివాసముంటున్న బాబుల్‌రెడ్డి (35) అనే వ్యక్తి జీవితం మీద విరక్తి చెంది ఆదివారం ఉదయం ట్యాంక్ పైనుంచి కిందికి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అనంతపురం జిల్లా యల్లనూరు మండలం వెన్నపూసపల్లె గ్రామానికి చెందిన బాబుల్‌రెడ్డికి తల్లిదండ్రులు చనిపోవడంతో మేనత్త అయిన లక్ష్మమ్మ దగ్గరే ఉంటున్నాడు. కొన్నేళ్ల క్రితం తల్లిదండ్రులు చనిపోవడంతో బాబుల్‌రెడ్డికి మతిస్థిమితం సరిగా లేక మానసికంగా ఇబ్బందులు పడుతుండేవాడు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం పులివెందులలోని రంగనాథస్వామి గుడి సమీపంలో ఉన్న వాటర్ ట్యాంక్ ఎక్కి కిందికి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ విష్ణు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వైఎస్సార్ సర్వజన ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కడుపునొప్పి తాళలేక..

కొండాపురం : మండల పరిధిలోని తాళ్ల ప్రొద్దుటూరుకు చెందిన తిమ్మక్కగారి సుబ్బరాయుడు (27) కడుపునొప్పితో బాధపడుతూ ఆత్మహత్య చేసుకున్నట్లు తాళ్ల ప్రొద్దుటూరు ఏఎస్ఐ లక్ష్మిరెడ్డి తెలిపారు. ఏఎస్ఐ కథనం మేరకు.. సుబ్బరాయుడు ఎలక్ట్రికల్ పనులు చేసుకుంటూ జీవనం సాగించే వాడు. ఈ క్రమంలో కడుపునొప్పి తాళలేక వాస్మోల్ తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలియజేశారు.

స్టార్టప్ రంగంలో కొత్త అధ్యాయం ‘భాస్కర్ ప్లాట్‌ఫాం’

పులివెందుల వాసి భాస్కర రామ్ కృషి



పులివెందుల టౌన్ : భారతదేశంలో స్టార్టప్‌లకు నూతన వేదికగా రూపుదిద్దుకుంటున్న భాస్కర్ వేదికను స్టార్ట్ అప్ ఇండియా వారు (భారత స్టార్టప్ పరిజ్ఞాన ప్రాప్యత రిజిస్ట్రీ) ప్రారంభించారు. ఈ భాస్కర్ ప్లాట్‌ఫాం వేదిక రూపకల్పన, ప్రణాళికకు వైఎస్ఆర్ జిల్లా పులివెందులకు చెందిన అల్లం భాస్కర రామ్ స్థాపించిన ‘కెర్డోస్ ఇన్‌ఫ్రాసాఫ్ట్’ అనే సంస్థ కృషి చేసింది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మినిస్ట్రీ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ వారికి కంపెనీ కేరడోస్ సంస్థ జనరల్ మేనేజర్ అల్లం భాస్కర రామ్, డైరెక్టర్ రాజేష్‌లు తమ ఆలోచనలు, ప్రణాళికలను పంపించడం జరిగింది. ఇందుకు స్పందించిన గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వారు స్టార్టప్ ఇండియా వారు వెంటనే ‘భాస్కర్ ప్లాట్‌ఫాం’ వేదికను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ వేదికకు కేరడోస్ సంస్థ జనరల్ మేనేజర్ భాస్కర రామ్ పేరులోని భాస్కర్‌ను తీసుకోవడం జరిగింది. ఈ వేదిక ద్వారా పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, మార్గదర్శకులు, విధాన నిర్ణేతలను ఒకే వేదికపైకి తీసుకొస్తూ స్టార్టప్‌లకు మార్కెట్ల పెద్ద అవకాశాలు, నూతన మార్గదర్శకాలు అందించే విధంగా డిజైన్ చేశారు. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మినిస్ట్రీ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ వారు ఒక ప్రశంసా పత్రాన్ని కూడా కెరడోస్ సంస్థ ప్రతినిధులకు పంపించారు.

సాఫ్ట్‌వేర్‌ల అభివృద్ధికి కృషి

కెర్డోస్ ఇన్‌ఫ్రాసాఫ్ట్ ప్రైవేట్ లిమిటెడ్ సాంకేతికత, ఆవిష్కరణల్లో ప్రత్యేకంగా పని చేస్తున్న సంస్థగా, ప్రధానంగా ఓపెన్ సోర్స్ సాఫ్ట్‌వేర్‌ల అభివృద్ధి వాటికి మద్దతు అందించడంలో కృషి చేస్తూ ఉంది. బ్లాక్‌చైన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్, ఫుల్ స్టాక్ వెబ్ డెవలప్‌మెంట్ వంటి అత్యాధునిక సాంకేతిక రంగాల్లో అభివృద్ధి చేయడం ఈ సంస్థ ప్రధాన లక్ష్యం. అంతే కాకుండా, లినక్స్ ఫౌండేషన్, హైపర్‌లెడ్జర్ ఫౌండేషన్, ఓడబ్ల్యూఏఎస్పీ, క్లౌడ్‌ఫ్లేర్, ఐపీఎఫ్ఎస్, ఎథీరియం, డిబియన్ వంటి అంతర్జాతీయ ఓపెన్ సోర్స్ సంస్థలతో భాగస్వాములు కలిగి, ఈ సంస్థ వాటి అభివృద్ధికి కూడా తోడ్పడుతోంది. భాస్కర్ వేదికలో ‘కెర్డోస్ ఇన్‌ఫ్రాసాఫ్ట్’ సంస్థ కీలక భాగస్వామిగా ఉండటంతో, దేశవ్యాప్తంగా స్టార్టప్‌లు వ్యాపార అవకాశాలను విస్తరించుకోవడం, పెట్టుబడిదారులను ఆకర్షించడం, సాంకేతిక జ్ఞానం పెంపొందించుకోవడం సులభతరమవుతుంది. గ్లోబల్ ఎంట్రప్రెన్యూర్ షిప్‌లో భారతదేశ స్థాయిని పెంచుతూ, యువ పారిశ్రామికవేత్తలకు భాస్కర్ వేదిక ద్వారా కొత్త ఆవిష్కరణలకు, అభివృద్ధికి ప్రేరణను అందించేలా కెర్డోస్ ఇన్‌ఫ్రాసాఫ్ట్ సంస్థ కృషి చేస్తోంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు, ఆలోచనలు, సూచనలను సంబంధిత కేంద్ర ప్రభుత్వ శాఖకు పంపించగా వారు ఈ కెరడోస్ సంస్థ ప్రతిపాదించిన సూచనలకు అనుగుణంగా భాస్కర్ వేదికను ప్రకటించడం విశేషం. అంతేగాక కెరడోస్ సంస్థ ప్రతినిధులను వారిని ప్రత్యేకంగా అభినందించారు. భారతదేశ ఆవిష్కరణల భవిష్యత్తును అభివృద్ధి చేయడంలో భాగస్వాములు కావాలని, భాస్కర్ ద్వారా కనెక్ట్ అయి, క్రమంగా నూతన స్టార్టప్‌లు ఎదగాలని కెరడోస్ సంస్థ ప్రతినిధులు అల్లం భాస్కర్, రాజేష్ కోరుతున్నారు.

పెన్నాలో గుర్తుతెలియని మృతదేహం

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగులోని దిగువ పట్నం కాలనీ సమీపంలో కొండయ్య పొలం గట్టున పెన్నా నది ఒడ్డున గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు పట్టణ సీఐ లింగప్ప ఆదివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానికులు అందించిన సమాచారం మేరకు సీఐ తమ సిబ్బంది కలిసి సంఘటన స్థలానికి వెళ్లి చూశారు. మృతుడు బట్ట తల కలిగి ఉన్నాడు. అతనికి 45 నుంచి 50 ఏళ్లు ఉండవచ్చు. నలుపు రంగు కాటన్ ప్యాంటు, బ్లూ కలర్ గళ్ల చొక్కా ధరించాడు. నాలుగు రోజుల నుంచి ఎవరైనా కనిపించకుండా పోయిన వ్యక్తి ఆచూకీ గురించి తెలిస్తే జమ్మలమడుగు పట్టణ పోలీస్ వారిని కలవాలని సీఐ సూచించారు. మృతదేహాన్ని గుర్తించిన వారు తమకు వచ్చి తెలపాలన్నారు. వివరాలు 9121100603, 9121100604 నంబర్లకు తెలియజేయాలన్నారు.

రుషికొండ భవనాలపై అసత్య ప్రచారం తగదు

ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం



ఖాజీపేట(చాపాడు) : విశాఖ రుషికొండపై వైఎస్ జగన్ ప్రభుత్వం అత్యాధునిక టెక్నాలజీతో నిర్మించిన విలాసవంతమైన భవనాలు అత్యద్భుతమని ముఖ్యమంత్రి చంద్రబాబు డ్రోన్స్ ద్వారా స్వయంగా చూపించాకే ప్రపంచానికి తెలిసిందని ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. అయితే ఈ భవనాలపై కూటమి నాయకులు అసత్య ప్రచారం చేయడం తగదన్నారు. ఖాజీపేట మండలం దుంపలగట్టులోని తన నివాసంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విశాఖపట్నం పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చెందిందని, దానిని ఇంకెంతో అభివృద్ధి చేయాలనే సదుద్దేశంతో పర్యాటక రంగాన్ని కొత్త పుంతలు తొక్కించాలని.. రుషికొండలో రూ.500 కోట్లతో అత్యాధునిక టెక్నాలజీతో భవనాలు నిర్మిస్తే అవి వైఎస్ జగన్ సొంతానికి వాడుకున్నట్లు విషం చిమ్మడం, గ్లోబెల్స్ ప్రచారం చేయడం నీచ రాజకీయానికి పరాకాష్ట అని విరుచుకుపడ్డారు. రుషికొండ భవనాన్ని పర్యాటక అభివృద్ధి కోసం, రాష్ట్రపతి, ప్రధాని, ముఖ్యమంత్రి, చీఫ్ జస్టిస్‌ల పర్యటనలకు వాడుకోవచ్చని, పర్యాటక అభివృద్ధిలో భాగంగా సినిమాల కోసం లీజుకు ఇవ్వచ్చని సూచించారు. కానీ కేవలం ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు డైవర్ట్ పాలిటిక్స్‌లో భాగంగా అద్భుత భవనాలపై విషం చిమ్మడం ఏమిటని ఆయన ప్రశ్నించారు.

ప్రతిభాన్వేషణ

- 20 నుంచి కౌశల్ సైన్స్ క్విజ్ పోటీలు
- సృజనాత్మకత వెలికి తీసేందుకు యత్నం
- ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల విద్యార్థులకు సదవకాశం

ఏ తరగతుల విద్యార్థులకు పోటీలు	8, 9, 10
రిజిస్ట్రేషన్‌కు ఆఖరి తేదీ	నవంబర్ 15
పాఠశాల స్థాయి పరీక్ష (ఆన్‌లైన్)	నవంబర్ 20, 21, 22
జిల్లా స్థాయి పరీక్ష (ఆన్‌లైన్)	డిసెంబర్ 6
రాష్ట్ర స్థాయి పోటీలు (ఆఫ్‌లైన్)	డిసెంబర్ 29, 30

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి గత ప్రభుత్వం ఎంతో కృషి చేసింది. దీంతోపాటు అందులో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకుంది. ఇప్పటికే సర్కారు బడుల్లో డిజిటల్ హంగులను సమకూర్చింది. ఇందులో భాగంగానే ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్(ఏఎఫ్‌పీ) స్మార్ట్ టీవీలతో విద్యార్థులకు బోధనలు అందిస్తున్నారు. అలాగే జాతీయ ప్రమాణాలతో కూడిన సెంట్రల్ సిలబస్ బోధనలు పలు పాఠశాలల్లో అమలు చేస్తున్నారు. తాజాగా ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి ప్రోత్సహించుటకు భారతీయ విజ్ఞాన మండలి(బీవీఎం), ఆంధ్రప్రదేశ్ సైన్సు సిటీ సంయుక్త ఆధ్వర్యంలో కౌశల్-2024 పోటీల్లో నిర్వహణకు సన్నద్ధమవుతున్నారు. ప్రతిభాన్వేషణలో భాగంగా విద్యార్థులకు పాఠశాల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఈ పోటీలు నిర్వహించనున్నారు. పాఠశాల, జిల్లా స్థాయి పోటీలు ఆన్‌లైన్‌లో.. రాష్ట్రస్థాయి పోటీలు ఆఫ్‌లైన్‌లో నిర్వహించనున్నారు. రాష్ట్ర స్థాయి పోటీలను డిసెంబర్ 29, 30 తేదీలలో విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ కళాశాలలో నిర్వహిస్తారు. ఈ పోటీల్లో భాగంగా కౌశల్ సైన్సు క్విజ్ పోటీలు, పోస్టర్ కాంపిటీషన్, వైజ్ఞానిక లఘు చిత్ర పోటీలు నిర్వహించనున్నారు. ఇందులో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతితోపాటు ప్రశంసాపత్రం, జ్ఞాపికలు అందజేయనున్నారు.

కౌశల్ సైన్సు క్విజ్ పోటీ..

ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులు మాత్రమే ఈ పోటీలకు అర్హులు. ఇందులో ప్రతి తరగతి నుంచి ముగ్గురు మెరిట్ విద్యార్థులను మాత్రమే ఎంపిక చేస్తారు. వీరికి ఈ పోటీలు నిర్వహిస్తారు.

సిలబస్ ఇలా..

ప్రభుత్వ రంగ పాఠశాలల్లో 8, 9, 10 తరగతులకు సంబంధించి గణితం, విజ్ఞానశాస్త్రం, సాంఘికశాస్త్రం, విజ్ఞానశాస్త్ర రంగంలో భారతీయ శాస్త్రవేత్తల కృషి అనే అంశాలకు సంబంధించి ఇప్పటి వరకు జరిగిన సిలబస్ పరిధిలో చదవుకోవాల్సి ఉంటుంది.

ప్రతిభ గల విద్యార్థులను గుర్తించాలి



గణితం, సైన్స్, సాంఘికశాస్త్రం సబ్జెక్ట్‌లలో ప్రతిభ గల విద్యార్థులను ఉపాధ్యాయులు, పాఠశాల కో ఆర్డినేటర్లు గుర్తించాలి. ఇందులో సైన్సు క్విజ్ పోటీలు, పోస్టర్ ప్రజంటేషన్ పోటీలు, వైజ్ఞానిక లఘు చిత్రం పోటీల్లో 8, 9, 10వ తరగతుల విద్యార్థులు పాల్గొనాల్సి ఉంటుంది. ఇందులో తరగతుల వారీగా ప్రతిభ గల విద్యార్థులను ఉపాధ్యాయులు గుర్తించి ప్రోత్సహించాలి.

- మీనాక్షి, జిల్లా విద్యాశాఖ అధికారి, వైఎస్సార్ జిల్లా

15లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో చదువుతూ ఆసక్తి గల విద్యార్థుల వివరాలను పాఠశాల కో ఆర్డినేటర్లు నవంబర్ 15వ తేదీ లోపు www. bv-ma p.orf ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ఈ విషయంపై గణితం, సైన్సు ఉపాధ్యాయులు విద్యార్థుల్లో ఉత్సాహం నింపాలి. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ : 9440507133ను సంప్రదించాలి.

- కేవీ విజయమోహన్‌రెడ్డి, కౌశల్ జిల్లా కో ఆర్డినేటర్

బహుమతులు ఇలా..

ఈ క్విజ్ పోటీలో జిల్లా స్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్, జ్ఞాపిక, నగదు(నగదు టీంలకు ఇవ్వనున్నారు) ఇస్తారు.

క్విజ్ పోటీలు

బహుమతులు	జిల్లా స్థాయి	రాష్ట్ర స్థాయి
ప్రథమ బహుమతి	4,500	15,000
ద్వితీయ బహుమతి	3,000	12,000
తృతీయ బహుమతి	0	9,000

రాష్ట్ర స్థాయిలో ప్రోత్సాహక బహుమతుల కింద రూ. 6 వేలు చొప్పున నగదు ఇస్తారు.

పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు

పోస్టర్ 1 పోటీలు : జనరల్ (థీమ్) అంశంపై 8వ తరగతి విద్యార్థులు ఇద్దరు మాత్రమే పాల్గొనాలి.
పోస్టర్ 2 పోటీలు : విజ్ఞాన శాస్త్ర రంగంలో భారతీయ కృషిపై 9 తరగతి విద్యార్థులు ఇద్దరు మాత్రమే పాల్గొనాలి.
ప్రశంసాపత్రం, జ్ఞాపిక, నగదు (వ్యక్తిగతం-2 పోస్టర్లకు విడివిడిగా) ఇస్తారు.

బహుమతులు	జిల్లా స్థాయి	రాష్ట్ర స్థాయి
ప్రథమ బహుమతి	1,500	5,000
ద్వితీయ బహుమతి	1,000	3,000
తృతీయ బహుమతి	0	2,000

వైజ్ఞానిక లఘు చిత్రం పోటీలు

సులభ సూత్రాలు ఉపయోగించి రూట్ 2 విలువలు కనుగొనుట (లేదా) ప్రాచీన భారతీయ శాస్త్రజ్ఞుల పరిశోధనలు (17వ శతాబ్ద పూర్వం)
ఈ పోటీలకు 10వ తరగతి నుంచి ఇద్దరు విద్యార్థులు మాత్రమే నమోదు కావాలి.
బహుమతులు : ప్రశంసాపత్రం, జ్ఞాపిక, నగదు (నగదు వ్యక్తిగతం)

బహుమతులు	జిల్లా స్థాయి	రాష్ట్ర స్థాయి
ప్రథమ బహుమతి	1,500	5,000
ద్వితీయ బహుమతి	1,000	3,000
తృతీయ బహుమతి	0	2,000

రాష్ట్రస్థాయిలో కన్సొలేషన్ బహుమతులు రూ.1,500 చొప్పున నగదు ఇస్తారు.